శ్రీలంక




# శ్రీలంకలో జాతి సమస్య: చారిత్రక, సామాజిక వాస్తవాలు

శ్రీలంక తమిళుల పోరాటం ఇవ్వాళో రేపో జాఫ్నా మీద జెండా ఎగరవేయబోతున్నదని కొన్నాళ్ళ కింద అనిపించింది గానీ వారి కోరిక అంత త్వరగా తీరబోయేది కాదని ఇప్పుడర్థం అవుతున్నది. జాఫ్నా ద్వీపకల్పంలోకి దాదాపు అయిదేళ్ళ విరామం తరువాత ఎల్‌టిటిఇ సాయుధ బలగాలు పునఃప్రవేశించగలిగాయి. అయితే శ్రీలంక సైన్యం అంత సులభంగా అక్కడి నుండి నిష్క్రమించే సూచనలు లేవు. సైనిక జవాన్ల ఆత్మస్థైర్యం బాగా బలహీనపడిందనీ, వారు తుపాకులు వదిలేసి పారిపోవడానికి సిద్ధంగా ఉన్నారనీ పత్రికలు మొదటి వారం రోజులు రాసాయి గానీ, వారి మనోబలాన్ని నిలబెట్టడంలో శ్రీలంక ప్రభుత్వం కృతకృత్యమయినట్టుంది.

ఎల్‌టిటిఇ సాయుధ బలగాలు అయిదేళ్ళ తరువాత పునఃప్రవేశం చేస్తున్నాయంటే అయిదేళ్ళుగా ఎల్‌టిటిఇ జాఫ్నాలో లేదని కాదు. ఏ రాజకీయ ఉద్యమమయినా భౌతికశక్తే కాక భావాల శక్తి కూడ. 'ఈలం' కాంక్ష జాఫ్నా తమిళులలో చాలా బలంగా ఉంది. మెజారిటీ ప్రజలలో ఉందని కూడ నిస్సంకోచంగా చెప్పుకోవచ్చు. వారిలో ఎల్‌టిటిఇ అభిమానులు, అనుయాయులు చాలామందే ఉన్నారు. జాఫ్నా తమిళుల జాతీయవాదానికి తానే ఏకైక ప్రతినిధి అని ఎల్‌టిటిఇ అంటుంది, కాదన్న వాళ్ళను

నిర్దాక్షిణ్యంగా నోరు మూయిస్తుంది. అది నిజం కాకపోయినప్పటికీ ఎల్‌టిటిఇకి చాలా మద్దతు ఉన్న మాట వాస్తవం. సాగించుకోగల వాళ్ళకు ప్రజాదరణ – వేరే ఏ కారణంగా కాకున్నా సాగించుకోగలిగారన్న కారణంగా – పెరగడం సహజం కాబట్టి ఆ మద్దతు బహుశా పెరుగుతుండవచ్చు, ఈ మధ్య పెరిగి ఉండవచ్చు.

తమిళ జాతీయవాదాన్ని గురించి మాట్లాడేటప్పుడు 'జాఫ్నా తమిళులు' అంటున్నామని గమనించే ఉంటారు. జాఫ్నా పట్టణం శ్రీలంక ఈశాన్య భాగాన ఉన్న తమిళ ప్రాంతంలోని ప్రధాన నగరం. శ్రీలంకలో తమిళం మాట్లాడే జనాభా 25 శాతం ఉన్నారు గానీ వారంతా చారిత్రకంగా, సాంస్కృతికంగా ఒకటి కాదు. రాజకీయంగానూ ఒకటి కాదు. తొలి నుండి శ్రీలంక వాసులే అయిన తమిళులు ఈశాన్య ప్రాంత వాసులు. బ్రిటన్‌కు ఆ దేశం వలసగా ఉన్న రోజులలో ఇండియా నుండి ముఠా కూలీలుగా శ్రీలంక మధ్య ప్రాంతంలోని తోటలలో పనిచేయడానికి వలస వెళ్ళిన 'ఇండియన్ తమిళులు' వేరే ఉన్నారు. మూడవ తమిళ వర్గం తూర్పు తీరాన ఉన్న తమిళం మాట్లాడే ముస్లింలు.

ఈ మూడు రకాల తమిళులు కలిసి దేశ జనాభాలో 25 శాతం ఉన్నారు గానీ వేర్పాటువాద తమిళ జాతీయ ఆకాంక్ష ప్రధానంగా ఉన్నది ఈశాన్య ప్రాంతంలోని 'జాఫ్నా తమిళుల'లో మాత్రమే.

తమిళ ప్రజలను, తమిళ భాషను రెండవ శ్రేణికి చెందినవిగా చూస్తున్నారనేది సింహళ జాతిపైన, శ్రీలంక రాజ్యంపైన తమిళుల అభియోగం. రెండు జాతులకూ భాషా భేదమే కాక మత భేదం కూడ ఉండడం సమస్యను పెంచింది. తమిళులు అత్యధిక భాగం హిందువులు కాగా సింహళులు బౌద్ధులు. ఇద్దరిలోనూ కొందరు క్రైస్తవులున్నారు గానీ తమిళులలో బౌద్ధులు గానీ సింహళులలో హిందువులు గానీ లేరు. శ్రీలంక రాజ్యాంగం – చట్టం ముందు అందరూ సమానమేనన్న హామీ ఇస్తుంది. మతం, జాతి, భాష వగైరాల ప్రాతిపదికన వివక్ష పాటించడానికి వీలులేదంటుంది. అయితే బౌద్ధమతానికి శ్రీలంకలో 'ప్రప్రథమ స్థానం' ఉంటుందనీ, ఆ మతాన్ని రక్షించే బాధ్యత, పెంపొందించే బాధ్యత శ్రీలంక రాజ్యాంగం మీదే ఉన్నాయనీ అంటుంది. ఇది సహజంగానే మైనారిటీ మతస్తులకు కంటగింపయింది.

సింహళ భాష శ్రీలంక అధికార భాష. దానితోబాటు 25 శాతం ప్రజలు మాట్లాడే తమిళానికి కూడ అధికార భాషగా గుర్తింపు ఇవ్వాలన్న డిమాండును శ్రీలంక రాజ్యం 1988 దాకా ఒప్పుకోలేదు. ఒప్పుకున్న తరువాత కూడ పరిస్థితి పెద్దగా మారలేదు. శ్రీలంక ప్రభుత్వం తమిళ పౌరులతో సహా అందరితోనూ సింహళ భాషలోనే సంభాషిస్తుంది. కోర్టులలో సింహళ భాషలో పిటిషన్లు వేసుకోవచ్చును గానీ తమిళంలో వేసుకోవడానికి వీలు లేదు. ఉద్యోగ రంగంలో అప్రకటితమైన వివక్ష ఉంది. భద్రతాదళాలయితే నూటికి నూరు శాతం సింహళులతో నిండి ఉన్నాయి. ఈ పరిస్థితి తమిళ మైనారిటీలలో అభద్రత, నిరసన పెంచాయంటే ఆశ్చర్యపోనక్కరలేదు.

అయితే దీనికొక పూర్వరంగం లేకపోలేదు. శ్రీలంక బ్రిటన్‌కు వలసగా ఉన్న రోజులలో తమిళులు వలస రాజ్యానికి కొంత సన్నిహితంగా ఉండి ఉద్యోగ అవకాశాలు, ఇతర ప్రయోజనాలు పొందారు. 'బ్రిటిష్ వలసవాదం అన్నిచోట్లా చేసినట్టే మైనారిటీలను చేరదీసి ప్రయోజనాలు కల్పించింది' అని దీన్ని వ్యాఖ్యానించడం కద్దు. అయితే బ్రిటిష్ వాళ్ళు వెళ్ళిపోతే స్థానిక మెజారిటీ పాలనలో తాము నలిగిపోతామని అన్ని వలస దేశాలలోనూ మైనారిటీలు భయపడిన సంగతి కూడ వాస్తవమే. ఆ భయం అహేతుకం కాదని వలసానంతర చరిత్ర రుజువు చేస్తున్నది. ఆ భయాన్ని బ్రిటిష్ వలస పాలకులు తమకు అనుకూలంగా మలచుకున్నారనుకోవాలా లేక తమ పౌరులలో ఒక భాగమైన ఆ ప్రజల భయాందోళనలకు సానుభూతిగా స్పందించడం మాత్రమే తాము చేసామన్న బ్రిటిష్ పాలకుల వాదనను ఆమోదిస్తామా అనేది ఒక విషయం కాగా, మైనారిటీలు భయపడవలసిన అగత్యం లేదని మెజారిటీగా ఉన్నవారు భరోసా ఎందుకు ఇవ్వలేకపోయారనేది అంతకంటే ముఖ్యమైన విషయం. 'విభజించి పాలించే' వలస నీతిని తిట్టుకోవడం ఈ ఆత్మపరీక్షను తప్పించుకోవడానికి మాత్రమే పనికొచ్చిందేమో ఆలోచించాలి.

ఏమయితేనేం, వలస కాలంలో పాలకుల పంచన చేరి ప్రయోజనాలు పొందారన్న కక్షతో వలసానంతర పాలనలో తమిళులకు సింహళులు సమాన హక్కులు లేకుండ చేసి, ఏ భయంతో వలస పాలకుల పంచన చేరవలసి వచ్చిందని మైనారిటీలు సమర్థించుకుంటాయో ఆ భయాన్నే నిజం చేసారు. తమిళుల డిమాండ్లకు ఏ మాత్రం లొంగకుండ ఉండడం సింహళ జాతీయవాదాన్ని నిర్వచించే సూత్రం అయింది. ఆ

దేశ పాలకులు కొంచెం ఉదార దృక్పథంతో ఒక్కడుగు వెనక్కి తగ్గినప్పుడల్లా సింహళ జాతీయవాదం ప్రతిపక్షాల రూపంలోనూ, బౌద్ధ భిక్షువుల రూపంలోనూ అడ్డం పడింది. 1957లో అప్పటి ప్రధానమంత్రి బండార నాయకె (ప్రస్తుత అధ్యక్షురాలు కుమారతుంగ తండ్రి), 1965లో అప్పటి ప్రధానమంత్రి సేనానాయకె తమిళ ప్రతినిధులతో చేసుకున్న ఒడంబడికలకీ ఈ గతే పట్టింది.

తప్పుడు పనికి అందమైన పేరు పెట్టుకోగలిగితే ఇంక ఆపేవారు ఉండరు. తమిళులకు సమాన హక్కులు ఇవ్వడం భారత ఆధిపత్య వాదానికి తల ఒగ్గడం అనేది శ్రీలంక రాజకీయాలలో తరచుగా వినిపించే వాదన. అంటే స్థానిక తమిళులను అణచివేయడం భారత సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడంలో భాగం. అందువల్ల ఎక్కడా లేనిది శ్రీలంకలో మాత్రమే వామపక్ష ఉద్యమమైన జెవిపి (జనతా విముక్తి పెరుమన) కూడ తమిళ మైనారిటీకి 'ఏ రాయితీలూ ఇవ్వడానికి వీలు లేదు' అని వాదిస్తుంది. 'మెజారిటీ ఏంది, మైనారిటీ ఏంది? పౌరులంతా ఒకటే' అంటుంది. మన దగ్గర బిజెపి మాత్రమే ఆ విధంగా వాదిస్తుంది. శ్రీలంకలో మానవతామూర్తి అయిన బుద్ధుడి అనుచరులూ, సమతా న్యాయాల సిద్ధాంతవేత్త అయిన మార్క్స్ అనుయాయులూ ఇద్దరూ అదే బాణిలో మాట్లాడతారు!

ఈ స్థితిలో తమిళ జాతీయవాదం మిలిటెంట్ రూపం తీసుకోవడం పెద్దగా ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. దానిని శ్రీలంక సైన్యం అతి క్రూరంగా అణచివేసేకొద్దీ అది మరింత రాటుదేలింది. ఆ మిలిటెన్సీ మొత్తంగా ఎల్‌టిటిఇ గొడుగు కిందికి పోవడం ఆశ్చర్యం కాకపోయినా ఆందోళన కలిగించే విషయం. మిలిటెన్సీలో పెత్తందారీ పోకడలు, క్రూరత్వం, ఆయుధ బలం నుండి వచ్చే అహంభావం ఎప్పుడూ ఎంతో కొంత ఉంటాయి గానీ ఎల్‌టిటిఇ ఈ విషయంలో ప్రపంచంలోని అన్ని మిలిటెంట్ ఉద్యమాలనూ తలదన్నే ఉద్యమం. ఎల్‌టిటిఇ ప్రభావమున్న ప్రాంతాలలో వారి మాట కాదని సింహళులే కాదు, తమిళులు సహితం బతకలేరు. అన్ని తమిళ పోరాట సంస్థలనూ ఎల్‌టిటిఇ బలప్రయోగంతో తనకు లోబరచుకుంది. హక్కుల కోణం నుండి ఈ పెత్తందారీ ధోరణిని విమర్శించినందుకు జాఫ్నా విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు, మానవహక్కుల కార్యకర్త అయిన డా॥ రజని తిరనగమను హతమార్చింది. శ్రీలంక ముస్లింలు తమిళులే అయినప్పటికీ జాఫ్నా తమిళుల

జాతీయవాదాన్ని పంచుకోని పాపానికి శ్రీలంక ఉత్తర భాగంలో వారి మనుగడను ఎల్‌టిటిఇ కష్టతరం చేసింది. ఫలితంగా 70 వేలమంది ముస్లింలు తూర్పుకు వలసపోయారు. 'ఈలం అంటూ వస్తే ఎల్‌టిటిఇ నుండి విముక్తి పొందడానికి తమిళు లు ఇంకా పెద్ద పోరాటం చేయవలసి ఉంటుంది' అని ఒక (మద్రాసు) తమిళ రచయిత అన్న మాటలు జోక్ కాదు.

సినిమాలలోనూ విప్లవ సాహిత్యంలోనూ తప్ప స్వచ్ఛమైన హీరోలు, స్వచ్ఛమైన విలన్లు ఎక్కడా ఉండరు. శ్రీలంకలోనూ అంతే. అంతమాత్రం చేత న్యాయాన్యాయాల విలువలు కల్తీ అయిపోవు. తమిళులకు ఆత్మగౌరవంతో సమాన పౌరులుగా బతికే హక్కుంది. దానిని ఒకరు కాదనడమూ అన్యాయమే. ఆ హక్కుకు తామే ఏకైక ప్రతినిధులమని మరొకరు అనడమూ అన్యాయమే.

*రాసిన సంవత్సరం 2000*
*అచ్చయిన తేదీ, పత్రిక తెలియవు*